ఆడబిడ్డ నిధికి మంగళం

- సూపర్ సిక్స్‌లో అమలు కాని మరో పథకం
- ఆ హామీ ఊసెత్తని నేతలు
- బాబు హామీలతో మోసపోయామంటున్న మహిళలు

నల్లజర్ల :ప్రజలను నమ్మించి మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. అధికారం కోసమే లక్ష్యంగా ఎన్నికల ముందు అమలు కాని హామీలు ఇవ్వడం తీరా అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలు గాలికి వదిలేయడం ఆయనకు మామూలేనని మహిళలు బహిరంగానే విమర్శిస్తున్నారు. మనమే గుడ్డిగా నమ్మి మోసపోయామంటున్నారు. సూపర్‌సిక్స్.. సూపర్ హిట్ అంటూ గత నెలలో అనంతపురంలో అట్టహాసంగా విజయోత్సవం నిర్వహించారు. నేతలంతా తమ ప్రసంగాలతో అదరగొట్టారు. సూపర్ సిక్స్‌లో ఇంకను అమలు కావాల్సిన పథకాల గురించి ఏ ఒక్క నేత నోరు మెదపడం లేదు. 19 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల మహిళలకు ప్రతి నెల రూ.1,500 అకౌంట్లో జమ చేయడం పథకం లక్ష్యం . కూటమి అధికారం చేపట్టి ఏడాదిన్నర కావస్తున్నా పథకం గురించి ఎక్కడా నోరు మెదపడం లేదు. దీంతో అసలు ఈ పథకం అమలు చేస్తారా? లేదా అన్న సందేహాలను మహిళలు వ్యక్తపరుస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో పెద్దపీట..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళలకు సంక్షేమ పథకాలు అందించడంలో పెద్దపీట వేసింది. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందేవి. మహిళలకు ఆర్థికంగా చేయూత నందించేందుకు వారి ఖాతాల్లోనే నేరుగా డబ్బు జమ చేసేది. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం, కాపునేస్తం, సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత వంటి పథకాల సొమ్మును నేరుగా మహిళల ఖాతాల్లో జమచేసేంది. కూటమి సర్కారు వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా .. ఆడబిడ్డ నిధి అమలుకు నోచుకోలేదు. దసరాకు ఈ పథకంపై ప్రభుత్వం ప్రకటన చేస్తారని అక్క చెల్లెమ్మలు ఆశగా ఎదురు చూశారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత లేకపోవడంతో వారి ఆశలు నీరుగారాయి. ఇచ్చిన హామీ మేరకు పథకాన్ని అమలు చేయాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

పథకం అమలు ఎపుడు..?

2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రజలు తనను నమ్మడం లేదని గ్రహించి తాను మారిన మనిషినని, సంపద సృష్టించి అన్ని పథకాలు అమలు చేస్తానని విస్తృతంగా ప్రచారం చేశారు.

తాము అధికారంలోకి వస్తే 19 నుంచి 59 ఏళ్ల మహిళందరికీ ఇంట్లో ఎంతమంది మహిళలుంటే అంతమందికి నెలకు రూ.1,500 చొప్పున సంవత్సరానికి రూ.18 వేలు ఇస్తామని కూటమి నేతలంతా ఊరు, వాడా ఊదరగొట్టారు. గెలిచిన తర్వాత అసలు ఆ విషయం ప్రస్థావనే లేదు. 2014 ఎన్నికలలోను బాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మోసం చేయగా ఈసారి ఆడబిడ్డ నిధి పేరుతో మహిళల్ని మోసం చేశారు.


టీడీపీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న మహిళలు

నియోజకవర్గంలో పరిస్థితి..

గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గంలోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల్లో మొత్తం ఈ పథకం అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాలని ఓ మంత్రి మాట్లాడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చేందుకు నోటికొచ్చినట్టు హామీలు ఇచ్చినపుడు ఆసంగతి తెలియదా అని వారు ప్రశ్నిస్తున్నారు.

కూటమి విశ్వసనీయత నిరూపించుకోవాలి



మహిళలను మోసగించడం చంద్రబాబుకు పరిపాటిగా మారింది. ఏడాదిన్నర కావస్తున్నా ఇంతవరకు పథకం అమలుకు శ్రీకారం చుట్టలేదు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాయంలో వైఎస్సార్ చేయూత కింద ప్రతి ఏటా మహిళలకు రూ.18,500 చొప్పున ఖాతాల్లో జమచేశారు. ఇచ్చిన హామీలు చేతల్లో చూపి కూటమి విశ్వసనీయత నిరూపించుకోవాలి.

యజ్ఞవరపు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు.అనంతపల్లి

గతంలో ఇటువంటి పరిస్థితి లేదు



వైఎస్సార్ సీపీ హాయాంలొ ప్రతి మహిళా సంవత్సరానికి గరిష్ఠంగా రూ.50వేలు నుంచి రూ.1 లక్ష వరకు సంక్షేమ లబ్ధి పొందేవారు. దింతో ఆర్థిక అవసరాల కోసం మగవారిపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా మహారాణులుగా చెలామణి అయ్యేవారు. నేడు కూటమి ప్రభుత్వంలో ఏడాదిన్నర కావస్తున్నా పూర్తి స్థాయిలో సూపర్‌సిక్స్ పథకాలు అమలుకు నోచుకోలేదు.

ఈడే నిర్మల, వైఎస్సార్ సీపీ మండల మహిళా ఉపాధ్యక్షురాలు, ఘంటావారిగూడెం

పాఠశాలల్లో అధికారుల తనిఖీ

చాగల్లు: రాష్ట్ర ఫుడ్ కమిషన్ గౌరవ సభ్యుడు ఇ.లక్ష్మిరెడ్డి కొవ్వూరు నియోజకవర్గంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గురువారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ గౌరవ సభ్యుడు ఈ.లక్ష్మిరెడ్డి కొవ్వూరు మండలం వేములూరు, పసివేదల, నేలటూరు, చాగల్లు మండలాల్లోని అంగన్‌వాడీ సెంటర్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలోని మధ్యాహ్న భోజన పథకం సదుపాయాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులతో ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద జట్టు కూలీలతో మాట్లాడారు. అంగన్‌వాడీ సెంటర్లలో, ప్రభుత్వ పాఠశాలల వంటశాలల్లో భోజన సదుపాయాల నిర్వహణ, పౌష్టికాహారం, శుభ్రత తదితర అంశాలను తనిఖీ చేసి, పిల్లలకు సురక్షిత, పౌష్టిక భోజనం అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని లక్ష్మిరెడ్డి సూచించారు. పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం చాగల్లు మండలంలోని ఊనగట్ల ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించడం ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం మరింత సమర్థవంతంగా ఉండాలన్నారు. ఫుడ్ కమిషన్ మెంబర్ వెంట జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి.శశాంక, డీఎం గణేష్ కుమార్, ఏఏఎస్‌వో ఎం.నాగంజనేయులు, ఏజీపీవో ఎం.రంగప్రసాద్, ఫుడ్ సేఫ్టీ అధికారి సుప్రియ, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


చాగల్లు జెడ్పీ హైస్కూల్‌లో ఎండీఎం పథకాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ గౌరవ సభ్యులు లక్ష్మీరెడ్డి

ఉత్తరం ఆగినా.. ఉనికి చాటుతోంది

నల్లజర్ల: ఉత్తరం ఆగినా తపాలాశాఖ ఉనికి కోల్పోలేదని డిజిటలీకరణ అందిపుచ్చుకొని రిజిస్టరు పోస్టు, స్పీడ్‌పోస్టుల ద్వారా సేవలు వేగంలో మరింత పెంచిందని దూబచర్ల గ్రామానికి చెందిన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా స్థానిక బ్రాంచి పోస్టుమాస్టర్ బిందును శాలువాతో సత్కరించారు. పోస్టుమాస్టర్ బిందు మాట్లాడుతూ తపాలాశాఖ పార్సిల్ పరంగా కొత్త సంస్కరణ విధానాలను తీసుకువచ్చిందన్నారు. గ్రామీణ సమాచార వ్యవస్థలో పోస్టల్ జీవిత భీమా, గ్రామీణ జీవిత భీమా, పొదుపుఖాతాల ఆన్‌లైన్ సేవలు, ఆధార్ నమోదు, ఈ-పోస్టు, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజనా, పౌరసేవలు, ప్రభుత్వ సేవలు అందించడం ద్వారా తనదైన పాత్ర పోషిస్తుందన్నారు. పొదుపు భీమా కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సంఘమిత్రా స్కూలు ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


దూబచర్ల బ్రాంచ్ పోస్టుమాస్టర్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

ఉపాధ్యాయుల ఆందోళన


దేవరపల్లి బస్టాండ్ వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

దేవరపల్లి: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో గురువారం స్థానిక బస్టాండ్ వద్ద ఆందోళన నిర్వహించారు. సమస్యలను తక్షణం పరిష్కరించకపోతే ఫ్యాప్టో పిలుపు మేరకు బోధనేతర పనులు బాయ్‌కట్ చేస్తామని తెలిపారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి-2 అప్పారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు ఎల్‌వీవీ రామారావు, పులపాకల గంగరాజు, కాటం బాబు, ఓరుగంటి శివరాజు, కె.ఉమాకాంత్, పి. విజయబాబు, ఎస్.ఈశ్వరరావు, ఎ.నర్సమ్మ, డి.రమా జానకీ, కె.భూషణం, ఎం. నిరంజన్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెట్లే కదా అని నరికేస్తున్నారు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ

గోపాలపురం: నూతన విద్యుత్ లైన్ల పేరుతో అతి పురాతనమైన చెట్లను నిర్లక్ష్యంగా నరివేస్తున్నారని గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. విద్యుత్ లైన్ల పేరుతో విలువైన వృక్ష సంపదను నరికివేయడంతో ఆయాగ్రామాలకు చెందిన కొంత మంది దళారులు ఇదే అదునుగా చూసుకొని ఆ చెట్ల నుంచి వచ్చిన కలపను సామిల్లులకు, వివిధ ఫ్యాక్టరీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఆర్అండ్‌బీ అధికారుల అనుమతులు లేకుండా సంబంధిత విద్యుత్ లైన్ కాంట్రాక్టర్ చొరవతో చెట్లను అనధికారికంగా నరికివేస్తున్నారని వాటిని వేలం నిర్వహించి ఆయా పంచాయతీలకు ఆదాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యుల సహకరించాలని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ సూచించారు. ఎంపీడీవో ఆర్ సుజాత, పరిపాలనాధికారి కె.ఎం.మంగతాయారు ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమ్మెకు విద్యుత్ విశ్రాంత ఉద్యోగుల మద్దతు

నిడదవోలు: ఈనెల 15న చేపడుతున్న విద్యుత్ ఉద్యోగుల నిరవధిక సమ్మెకు మద్దతుగా నిడదవోలు డివిజన్ విద్యుత్ రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘం సభ్యులు మద్దతు తెలిపారు. ఈ మేరకు సంఘ అధ్యక్షుడు ఏఎస్‌కే రాయుడు రాయుడు, కార్యదర్శి ఎస్వీ సత్యనారాయణలు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు రావలసిన నాలుగు డీఏలను త్వరితగతిన ఇప్పించాలన్నారు. అపరిమిత వైద్య సదుపాయాలకు ప్రత్యేకమైన విధివిధానాలు రూపొందించాలని, మరణించిన కార్మికుల కారుణ్య నియామకాలను వెంటనే ఇప్పించాలని కోరారు. పెన్షనర్స్ 2022 వేజ్ రివిజన్ తర్వాత మరణించిన వారికి రావలసిన డీఏ ఏరియర్స్ వేజ్ రివిజన్ ఇన్‌స్టాల్మెంట్ ఏరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. విద్యుత్ బోర్డ్‌లో రెగ్యులర్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు చేసే నిరవధిక సమ్మెకు పూర్తి మద్దతు తెలియజేస్తున్నామని వారు పేర్కొన్నారు.

పరిమితికి మించి పొగాకు పండించవద్దు

దేవరపల్లి: ప్రపంచ దేశాల్లో పొగాకు ఉత్పత్తి గణనీయంగా పెరిగినందున వర్జీనియా పొగాకు రైతులు పరిమితికి మించి పంట పండిస్తే నష్టపోతారని పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) జీఎల్‌కే ప్రసాద్ హెచ్చరించారు. 'పొగాకు సేద్యం - యాజమాన్య పద్ధతులు, పొగాకు పంట నియంత్రణ - ప్రత్యామ్నాయ పంటల సాగు' అనే అంశంపై దేవరపల్లి వేలం కేంద్రం పరిధి సంగాయగూడెంలో రైతులకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రపంచ దేశాల్లో పొగాకు ఉత్పత్తి 3,762 మిలియన్ కిలోల నుంచి 4,197 మిలియన్ కిలోలకు పెరిగిందని తెలిపారు. ముఖ్యంగా జింబాబ్వే, బ్రెజిల్, చైనా దేశాల్లో పంట ఉత్పత్తి అధికంగా ఉందని, ఈ కారణంగా ప్రస్తుతం మన రైతులు పండిచిన లో గ్రేడ్ పొగాకును మంచి ధరకు అమ్ముకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. ఈ ప్రభావం ఈ ఏడాది పంట ఉత్పత్తిపై పడుతుందన్నారు. రైతులు విధిగా పొగాకు పంట నియంత్రణ పాటించి, నాణ్యత పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. కేటాయించిన పరిమాణానికి లోబడి మాత్రమే సాగు చేయాలని ప్రసాద్ స్పష్టం చేశారు. గ్రామంలోని రైతు కుసులూరి శ్రీనివాస్ పొగాకు నర్సరీని పరిశీలించి నారుమడి పెంపకం, పురుగు మందుల వాడకం, తెగుళ్ల నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. రిజిస్ట్రేషన్ పొందిన రైతులకు మాత్రమే నారు అమ్మాలని స్పష్టం చేశారు. వేలం నిర్వహణాధికారి సీహెచ్ హేమస్మిత అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఐటీసీ ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, పీఎస్ఎస్ కంపెనీ ప్రతినిధి సీతారామరాజు, గౌతమ్, వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షులు కరుటూరి శ్రీనివాస్, ఆచంట గోపాలకృష్ణ, రైతు సంఘం ప్రతినిధులు యద్దనపూడి రవీంద్ర, కుసులూరి శ్రీనివాస్, ఆచంట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పొగాకు రైతుల సదస్సులో మాట్లాడుతున్న ఆర్ఎం ప్రసాద్

ఘనంగా ప్రపంచ తపాలా దినోత్సవం


పోస్ట్‌మేన్ నాగలింగంను సత్కరిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

తాళ్లపూడి: ప్రపంచ తపాల దినోత్సవం సందర్భంగా తాళ్లపూడిలోని శ్రీ విజేత హై స్కూల్‌లో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం డాక్టర్ జొన్నకూటి ప్రమోద్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక పోస్టాఫీసు సిబ్బందికి పుష్పగుచ్ఛం అందించి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల అకడమిక్ ఇన్‌చార్జి కె.కరుణ భారతదేశంలో తపాలా వ్యవస్థ గురించి వివరించారు. హెచ్ఎం ఆధ్వర్యంలో పాఠశాల అధ్యాపక సిబ్బంది తాళ్లపూడి పోస్ట్‌మ్యాన్‌గా సేవలందిస్తున్న చల్లా నాగలింగంను సత్కరించారు. అనంతరం పోస్టాఫీసులో లభించే సేవల గురించి నాగలింగం వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్, చంద్రిక, అలీ, గంగారత్నం, సలోమి, మేరీ కిరణ్మయి, చంద్రిక, సాయిలత, హేమ పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

తాళ్లపూడి (కొవ్వూరు): గోదావరి పుష్కరాలు రానున్న నేపథ్యంలో కొవ్వూరు పట్టణ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత ఆదేశించారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 2027లో గోదావరి మహా పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు, మౌలిక వసతులకు సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. కొవ్వూరు డివిజన్‌లో 48 ప్రధాన పుష్కర ఘాట్లు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో నిర్మాణ పనులకు నివేదికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కొవ్వూరు డివిజన్‌లో 67 దేవాలయాల అభివృద్ధికి మొదటి విడతగా రూ.9.87 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇకపై వారానికి ఒక్కసారి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా కొవ్వూరులో పుణ్య స్నానాలు ఆచరించడానికి వస్తారన్నారు. ఘాట్ల అభివృద్ధి, దేవాలయాలకు మరమ్మతులు, భక్తుల సౌకర్యాల కోసం తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమని రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, సూరపనేని చిన్ని, జిల్లా దేవదాయశాఖ అధికారి పీవీ సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డీఈఈ కె.ఆనందబాబు, తహసీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో రాణి సుష్మిత, ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

మానసిక ఆరోగ్యం అత్యంత అవసరం


విద్యార్థులు రూపొందించిన పోసర్లను ఆవిష్కరిస్తున్న హెచ్ఎం కోమలిచిత్ర

నల్లజర్ల: ప్రతి ఒక్కరికీ మానసిక ఆరోగ్యం అత్యంత ప్రధానమని నల్లజర్ల జెడ్పీ హైస్కూలు హెచ్ఎం సి.హెచ్.కోమలి చిత్ర అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆ పాఠశాలలో సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కోమలిచిత్ర మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, సక్రమంగా నిద్రపోవాలని సూచించారు. విద్యార్థులు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. నమ్మకమైన స్నేహితులు ఎంచుకోవాలని, ఒత్తిడిని దూరం చేసుకుంటూ జీవితంలో ముందుకు సాగి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. జిల్లా మానసిక ఆరోగ్య కౌన్సిలర్ భూలక్ష్మి మాట్లాడుతూ మానసిక ఆరోగ్య ప్రాముఖ్యతను, ఒత్తిడిని జయించడం, భావోద్వేగాల సమతుల్యత తదితర అంశాలపై వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండచిలువ హల్‌చల్

గోపాలపురం: మండలంలోని సాగిపాడు లెప్రసీ కాలనీ వద్ద బుధవారం రాత్రి సుమారు 12 అడుగుల పొడవున్న కొండ చిలువ హల్‌చల్ చేసింది. స్థానికులు వివరాల ప్రకారం సాగిపాడు లెప్రసీ కాలనీ వద్ద రాత్రి 9 గంటల సమయంలో రోడ్డుపైకి వచ్చి సుమారు గంట వరకూ కదలక పోవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. కొండ చిలువ కడుపులో ఎత్తుగా ఉండటంతో కదలలేక పోయిందని అనంతరం రోడ్డుపై నుంచి పుంతలోకి వెళ్లిపోయినట్లు చెప్పారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం, చిక్కాల 11 కేవీ వ్యవసాయ ఫీడర్లపై ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎన్. నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీపురం ఫీడర్‌పై ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

రైల్వే స్టేషన్‌లోని దుకాణాల్లో తనిఖీలు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ప్రధాన రైల్వే స్టేషన్‌లో తినుబండారాలను అధిక ధరకు విక్రయిస్తున్న దుకాణాలపై కేసు నమోదు చేసినట్లు లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ సాయిరామ్ ఆదేశాల మేరకు గురువారం ఆయా దుకాణాలపై దాడులు చేశామన్నారు. ఈ సందర్భంగా రూ.110 విలువైన డైరీ మిల్క్ చాక్లెట్‌ను రూ.115కు అమ్ముతుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో పాల్గొన్న జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ వస్తువులను ఎమ్మార్పీకి మించి కొనుగోలు చేయకూడదని వినియోగదారులకు సూచించారు. ఏవైనా ఫిర్యాదులుంటే 1915 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలన్నారు.

అనాథలా మారిన నగరపాలక సంస్థ

రాజమహేంద్రవరం సిటీ: పాలక వర్గం లేకపోవడంతో తల్లీతండ్రీ లేని అనాథలా నగరపాలక సంస్థ మారిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2027 జరిగే గోదావరి పుష్కరాల నేపథ్యంలో రూ.1500 కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని చెప్పిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు కనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. సరైన ప్రణాళికలు లేకపోవడం, అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోవడంతో పుష్కరాల నిర్వహణపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు రివర్ ఫ్రంట్ పేరుతో ఏదో చేద్దామని ఉత్సాహం చూపించారని, ఆ తర్వాత మంత్రివర్గం కమిటీ అనే సరికి నోరు విప్పడం లేదన్నారు. తెలుగు విశ్వవిద్యాలయానికి కనీసం వీసీ, రిజిస్ట్రార్‌ను నియమించి అడ్మిషన్లు కూడా ప్రారంభించలేదని కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఎంపీగా పురందేశ్వరిని ఎందుకు గెలిపించారో ప్రజలకే అర్థం కాని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయన్నారు.

క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక


టీడీపీ నేత వీరన్నను పార్టీలోకి ఆహ్వానిస్తున్న తలారి వెంకట్రావు

తాళ్లపూడి: మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పోతుల వీరన్న వైఎస్సార్ సీపీలోకి చేరారు. వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆయనకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్‌ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఆర్టీఐ వింగ్ కార్యదర్శిగా నియమించడంతో కృతజ్ఞతాపూర్వకంగా గ్రామంలోని నాయకులతో కలిసి తలారి వెంకట్రావును గురువారం శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పోతుల వీరన్న ఆయన సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. పార్టీ నాయకులు వల్లభశెట్టి చిన్ని, కోనాల వీర్రాజు, పైడి లక్ష్మీనాయుడు, బొంతా సాయి, సాలి రాజు, సాకా వెంకట్రావు, భర్తి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీవీ వినాయక్ జన్మదిన వేడుకలు


చాగల్లు లయన్స్ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు సురేంద్ర కుమార్

చాగల్లు: సినీ దర్శకుడు వీవీ వినాయక్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు గురువారం చాగల్లులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు, ఆస్పత్రిలో రోగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. తొలుత వినాయక్ అభిమానులు తీసుకువచ్చిన కేక్‌ను ఆయన సోదరుడు, మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్ర కుమార్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు మాట్లాడుతూ వీవీ వినాయక్ భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ చిత్రాలను ప్రేక్షకులకు అందించాలని ఆకాంక్షించారు. వినాయక్‌కు ఫోన్‌లో పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ముళ్లపూడి ఉదయ్ భాస్కర్, గేడా శ్యామ సుందరరావు, అనిశెట్టి సూర్యం, పిండి మంగరాజు, దాసరి కృష్ణ, ధూళిపూడి సూరిబాబు, బొర్రా రజనీ ప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో 306 మంది ఎంపిక


క్రీడాకారులకు మెడల్స్ అందజేస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు మీసాల శివరామ హరిప్రసాద్

నిడదవోలు: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిడదవోలు మండల స్థాయి అండర్ 14 -17 బాలబాలికల క్రీడా ఎంపిక పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో 306 మంది డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్టు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ బండి సతీష్ తెలిపారు. ఎంపికైన 306 మంది క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిడదవోలు రోటరీక్లబ్ అధ్యక్షుడు మీసాల శివరామ హరిప్రసాద్ ఆర్థిక సహాయంతో మెడల్స్‌ను అందజేశారు. క్లబ్ కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, అయినీడి పల్లారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, గాజుల రంగారావు, ఎండీ ఫయాజ్, అడ్డాల సత్య ప్రభాకర్, యాసరపు రామకృష్ణ, పొన్నా సుబ్రహ్మణ్యం, చిక్కాల సతీష్ కుమార్, పాలేటి శ్రీనివాస్ పీఈటీలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు పరామర్శ


పరామర్శిస్తున్న శ్రీనివాసనాయుడు

నిడదవోలు: శెట్టిపేటలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రోళ్ల కోటయ్య, ఆయన కుమారుడు ప్రమాదవశాత్తు మరణించిన రోళ్ల వెంకట సుబ్బయ్యల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి జి.శ్రీనివాసనాయుడు గురువారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు కురసాల నెహ్రూ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జడ్డు రాంబాబు ఎంపీటీసీ బయ్యే కృష్ణబాబు, విజయ్, సెనగన స్వామి, పి.ప్రసాద్, సోడాబత్తుల కొండలరావు, ఆర్.గంగరాజు, రవిచంద్ర, సతీష్, పాతూరి రామచంద్రుడు జనకేశ్వరరావు పాల్గొన్నారు.